101038701

# ప్రబోధ 10

మాటయందు తీపి మనసున చేదుంచ
మంచిదికాదిది మీకు మెచ్చుగాని.
మెచ్చులేని బ్రతుకెమహిలోన చెల్లరా
ఉన్నమాట తెలుపుచున్నమాట.

ప్రేమస్వరూపులారా!

ఒక దేశముయొక్క ఔన్నత్యము ఆదేశపుప్రజలపైన ఆధారపడివుంటుంది. ఒక విధముగావిచారిస్తే ఆదేశమునందలి మహనీయుల యొక్క చరిత్రలే దేశచరిత్రగా రూపొందుతూవచ్చింది. చరిత్రఅనగా మంచిసంస్కృతి. మంచి హృదయము, మంచినడతఅనిచెప్పుకోవచ్చు. అయితే యెన్ని విద్యలునేర్చినప్పటికిని, యెన్నిఉత్తమ అధికారములుసంపాయించినప్పటికి, అనేకశాస్త్రములందుప్రవీణుడని పేరుపొందినప్పటికిని, యీవిధమైనటువంటి చిత్తశుద్ధి లేకుండిన, లేక చరిత్రయేరూపొందకుండిన అట్టివారి యొక్క జీవితమంతయు నిరుపయోగమైపోతుంది.

చరిత్ర అనగా మరొకవిధముగా మనము ఆలోచించి చూచిన సత్శీలము అని ఒక అర్థము. ఈ సత్శీలమునకు పవిత్రము, సహనము, పట్టుదల యీమూడింటి యొక్కయేకత్వము. అత్యవసరము. దీనినే శీలత్రయములని పిలుస్తూవచ్చారు. ఈమూడింటి తోపాటు ధైర్యము, సాహసము, సహనము, పట్టుదల, త్యాగము, పరాక్రమము. ఈమూడింటితోపాటు యీపైగుణములన్నియు కూడినప్పుడే మానవుడు యీజగత్తునందు యనేకవిధములైనటువంటి విజయాన్నిసాధించగలడు. ఆదర్శమును నిరూపించగలడు. కేవలము పవిత్రము, సహనము, పట్టుదలవుండి మిగిలినటువంటి ధైర్యము, సాహసము, త్యాగము, ఔదార్యము యిలాంటిగుణములు లేకుండిన మానవత్వములో ఆదర్శవంతాన్ని, విజయవంతాన్ని సాధించటము చాలాదుర్లభము.

ఇక్కడశీలము అనేటువంటిది రెండు విధములుగా వుంటున్నది. వ్యక్తిగత శీలము ఒకటి. రెండవది జాతీయశీలము. అనగా Indiuindual Character, National Character. ఈవ్యక్తిగతమైనటువంటి శీలమునకు అనేకవిధములైనప్రయత్నములు, సాధనలు చేయవలసివస్తుంది. ఈవ్యక్తిగతమైనటువంటి శీలముగ్రంథములలో నేర్చుకునేటువంటిది కాదు. లేక గురువుల చేత బోధింపబడేటు వంటిది కాదు. బజారులో లభించేటువంటిది అంతకంటె కాదు. ఇది నిత్యసాధనల చేతను, సత్సంకల్పముల చేతను, సత్ప్రవర్తనల చేతను దీనిని పెంచుకోవాలి.. కానీ యీనాడు యీవ్యక్తిగతమైనటువంటి శీలము దినదిన మునకు దిగజారిపోవుచున్నది. నైతికమునందుగానీ, ధార్మికమునందుగానీ, ఆధ్యాత్మిక మునందుగానీ, లౌకికమునందుగానీ వైజ్ఞానమునందుగానీ, రాజకీయమునందుగానీ యీవ్యక్తిగతమైనశీలము పూర్తిక్షీణించిపోయింది. ఈనాటిసమాజములోపల కేవలము భుజబలము, బుద్ధిబలము, ధనబలము, జనబలము, వాక్

101038702

బలము యీవిధింటి బలములను మాత్రమే ప్రధానముగా చూస్తున్నారు. వ్యక్తిగతమైన శీలతత్వాన్ని యెవరు విచారించటంలేదు. దానియొక్క విషయమునే మాత్రము గుర్తించటంలేదు.

ప్రాచీన కాలమందు యీ వ్యక్తిగత శీలమును కలిగినటువంటి వ్యక్తులనే ఆదర్శమైనటువంటి వ్యక్తులుగా భావించేవారు. అట్టి మహనీయులనే తత్వవేత్తలని, ఆచార్యులని పిలిచేటువంటివారు. అట్టి మహనీయులు స్థాపించినటువంటి చరిత్రలే ప్రపంచమునకు ప్రధానమైనటువంటి వెలుతురుగా లోకానికి కనిపిస్తూ వచ్చేటువంటిది. అయితే యిట్టి చరిత్రాత్మకులైన మహనీయులు ఆనాటినుండి దేశము యొక్క ఔన్నత్యమును, పవిత్రతను కాపాడుతూ వచ్చేటువంటివారు. ఈవిధముగా వ్యక్తిగతమైన శీలము దినదినాభివృద్ధి గావించుకుంటూ క్షణక్షణమునకు తాను పరిశీలన చేస్తూ దానిని పోషించుకుంటూ రావాలి. ఇటి వ్యక్తిగతమైన శీలము ఒక్కటి వుండినంత మాత్రమున మన కార్యములు మనము సాధించలేము. ఇది కేవలము స్వార్థ ఉపయోగమునకై కొంతవరకును అవసరమవుతుంది. దేశోద్ధారమునకుగాని, దేశము యొక్క ఆదర్శమునకుగాని యీ వ్యక్తిగత శీలము అంత రాణించదు. తనను తాను తరింపచేసుకోవచ్చును. తనను తాను తృప్తిగావించుకోవచ్చును. అయితే యీ సమాజములో చేరి సమాజము యొక్క ఔన్నత్యాన్ని అభివృద్ధిపరచవలెనన్న వ్యక్తిగత శీలముతో బాటు జాతీయశీలము కూడను అత్యవసరము.

జాతీయశీలత అనగా దేశభక్తి. వ్యక్తిగత శీలము తన యొక్క మాతృప్రేమవంటిది. ఈ జాతీయశీలత National character అనేది దేశభక్తితో కూడినటువంటిది. అనగా దేశమును ప్రేమించటము. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి అని స్వర్గముకంటె యీ జన్మభూమియొక్క తత్వము, జన్మము నందించినటువంటి తల్లియొక్క ప్రేమతత్వమును అంత ప్రధానమైన లక్ష్యములో పోషించుకుంటూ వచ్చారు. కనుక వ్యక్తిగత శీలము తల్లితో సమానము. జాతీయశీలము దేశముతో సమానము. రెండింటియొక్క చేరికనే నెగిటివ్, పాజిటివ్ గా యేర్పడి తద్వారా అనేక విధములైన అనుకూలములుగా వించుకున్నట్లుగా వుంటుంది. లోకములో జాతీయశీలము కలిగినవారు అనేకములుగా వుంటుండవచ్చు. కాని వ్యక్తిగత శీలమే లేకుండిన జాతీయశీలమనేది జగత్తులో నిలువలేదు. ఒకవేళ వ్యక్తిగత శీలము వుండినప్పటికి జాతీయశీలము లేకుండిన తాను రాణించలేడు. అంతేకాక దేశము యొక్క ఔన్నత్యాన్ని సాధించలేడు. దేశము యొక్క ఔన్నత్యాన్ని సాధించటమే ప్రతి మానవుని కర్తవ్యము. ఏ దేశమునందు ఆ వ్యక్తి జన్మించెనో ఆ దేశము యొక్క ఔన్నత్యాన్ని తాను కోరి, ఆశించి ఆచరించి, అభివృద్ధికి తెప్పించటము తన కర్తవ్యము. ఈనాడు జాతీయశీలత వుండినప్పటికి, యనేక విధములుగా త్యాగము చేసినప్పటికి శాశ్వతమైనటువంటి దానినిగా రూపొందింపలేకపోతున్నారు.

భారతదేశములో స్వరాజ్యమును పొందే నిమిత్తమై అనేకమంది మహనీయులు తమ ధనమును, తమ మనస్సును, తమ దేహమును కూడను ధారపోసి స్వరాజ్యమును సాధిస్తూ వచ్చారు. వీరు జాతీయశీలతను ప్రధానముగా యెంచుకొని తద్వారా యీ కార్యమును సాధిస్తూ వచ్చారు. అయితే యీ జాతీయశీలత క్రమక్రమేణా దిగజారిపోతూ వచ్చింది. విదేశీయ చక్రవర్తి అయిన అక్బరు

101038703

మానసింగ్ అనేటువంటి భారతీయుడు విదేశీయ చక్రవర్తి అయిన అక్బర్‌కు లొంగి దాసుడై అనేకవిధములుగా భారతదేశమునకే కొన్ని యిక్కట్లు కలిగించుటానికి ప్రయత్నించాడు. రాణాప్రతాప్‌ను చాలా హింసించాడు. తీరని బాధలు కలిగించాడు. అక్బరు చక్రవర్తి అందించిన ధన కనక వస్తు వాహనాదులకు లొంగాడు. జయసింహుడు కూడను ఔరంగజేబ్‌నకు లొంగి, స్వార్థము, స్వప్రయోజనముడకు లోబడి దేశభక్తుడు, దైవభక్తుడు, ధర్మప్రీతి కలిగినటువంటి శివాజీపై నయుద్ధమునకు పూనుకున్నాడు. మరొకడు జయచంద్ర. ఇతను గోరీ మహమ్మద్‌కు లోబడి తద్వారా పృథ్వీరాజును చాలా హింసించాడు. పృథ్వీరాజు మహావీరుడు. కానీ నమ్మకమైనటువంటి వ్యక్తిగా భావించాడు జయచంద్రుని. కానీ నమ్మినటువంటి వాడే ద్రోహమునకు పూనుకున్నాడు. ఇంతే కాదు. అనేకమంది పండితులు పూజారులు, వేదశాస్త్ర యితిహాస పురాణములంతా అనేక విధములుగా తర్కించి వాదించి జయించినటువంటివారు కానీ మహమ్మద్ రాజైన అల్లావుద్దీన్‌కు లోబడి సోమనాథ దేవాలయాన్ని అప్పగించారు. భారతదేశమునుండి కొన్ని వందల యేనుగులు మోసేంత బంగారమును తమ దేశమునకు తరలిస్తూ వచ్చారు. దీనికి కారణమేమిటి? భారతదేశములో వీరులు లేక పోలేదు. బలవంతులు లేకపోలేదు. శూరులు లేకపోలేదు. పరాక్రమవంతులు లేకపోలేదు. పండితులు లేకపోలేదు. జాతీయశీలత కొరవటము చేతనే యీ విధమైనటువంటి దుర్మార్గమునకు గురై పోయింది భారతదేశము. కనుక నే వ్యక్తిగతశీలము తోబాటు జాతీయశీలత కూడను అత్యవసరమనేటువంటి సత్యాన్ని గుర్తించాలి.

దీనికి సహనము అత్యావసరము. భారతదేశములో స్వరాజ్యమునకు యనేక విధములుగా పాటుపడిన మహనీయులు యెంతో మంది వుంటున్నారు. అందులో మొదటివాడు గాంధీ. వల్లభాయి పటేల్, బాలగంగాధర తిలక్, సుభాస్ చంద్రబోస్, రాజారామ్ మోహన్ రాయ్ మదనమోహన మాలవ్య, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, నెహ్రూ. వీరు మాత్రమే కాకుండా యింకా అనేకమంది వీరిని అనుసరించి ఆశ్రయించి ఆదరించి యిందులో ప్రాణములు త్యాగము చేయటానికి సంసిద్ధులైనటువంటి యనేకమంది భారతీయులు వున్నారు. అయినప్పటికిని వారు యిన్ని విధముల సాధించినప్పటికిని జాతీయశీలతను అభివృద్ధిగావించుకొనిరే గానీ యిందులో కొంతమందికి వ్యక్తిగతశీలము లేక పోవటంచేతనే వారి పేరుప్రతిష్ఠలు అతిశీఘ్రకాలములోనే మాసిపోతూవచ్చాయి. అందరు గ్రేట్ మెన్లు అని చెప్పటానికి వీలులేదు. లౌకికంగా, భౌతికంగా రాజకీయంగా వీరందరు మహనీయులు కావచ్చును. లోకరీతిగా యీ బాహ్యమైన కర్మలను మాత్రమే ఆదర్శముగా తీసుకొని వారిని మహనీయులుగను, ఆదర్శవంతమైన పురుషులుగను విశ్వసించవచ్చునే గానీ దైవదృష్టియందు వ్యక్తిగతశీలము, జాతీయశీలము. దేశక్షేమాన్ని కూడను ఒకవైపు దృష్టియందుంచుకోవాలి. దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవ సనాతనః. జీవులకు దేహము యిల్లు దేవాలయము వంటిదో భగవంతునికి దేశము కూడను అటువంటి దేవాలయము వంటిది. కనుక యిలాంటి పవిత్రమైనటువంటి దేశము యొక్క స్థితిని మనము గుర్తించకుండా పోయిన యెంత గొప్పశీలవంతుడైనప్పటికి యిది రాణించదు. తద్వారా జగత్తుకు యే మాత్రము వుపకారము

101038704

చేయబోదు.

తోటి మానవులకు, దేశములో తనతో పాటు జన్మించిన సోదర మానవులకు సాను
భూతిని చూపించి, సహన భావమును నేర్పి సత్ఫలము అభివృద్ధిపరచేటువంటి మార్గములో ప్రతి
వ్యక్తి కూడను పాల్గొనాలి. మానవత్వమునకు సుఖము దుఃఖము వెంటుగా జంటగా వెంటాడుతూ
వుంటాయి. సుఖదుఃఖ సమానస్వలాభాలాభ జయాత్ అని సుఖ దుఃఖములు రెండింటిని సమత్వ
ముతో భావించుకునేటువంటి సమరసమును మనము నేర్చుకోవాలి.

శ్రీరామచంద్రుడు సూర్యోదయమైన తక్షణమే పట్టాభిషేకమునకు సిద్ధమ
య్యాడు. కానీ యీ పట్టాభిషేకము తనకు జరుగదు అని తెలియక పోలేదు. తెలిసినప్పటికీ పితృ
వాక్య పరిపాలన, కన్న తండ్రిని, కన్న తల్లులను బాధపెట్టకూడదు అనే భావముతో తాను ఆచరిస్తూ, అను
సరిస్తూ వెళ్ళాడు. కాలకర్మకారణకర్తృత్వములు కలసి రావటంచేత తన ప్రయత్నము కూడ విఫలమైంది.
ఏడు గంటలకు పట్టాభిషేకము జరుపుకొనవలసినటువంటి శ్రీరామచంద్రుడు అదే యేడు గంటల
కు అరణ్యవాసము పోవాలనుకుంటే యిది యే మానవత్వంలో వుండినటువంటి వ్యక్తికైనను చాలా బాధా
కరమైనటువంటి విషయముగా వుంటుంది. ఇది భరించలేని బాధగా వుంటుంది. కానీ శ్రీరామచం
ద్రుడు యిలాంటి వికారమునకు యెన్నడును అవకాశమివ్వక పట్టాభిషేకమునకు యే చిరునవ్వుతో
వచ్చాడో అదే చిరునవ్వుతోనే అరణ్యానికి వెళ్ళటానికి సిద్ధమయ్యాడు. ఇదే సమత్వమునకు సరైన గుర్తు.

లోకములో వ్యక్తిగత శీలము, జాతీయ శీలము యీ రెండింటి యొక్క సమత్వముతో
కూడినటువంటి వ్యక్తి ఒక్క దైవత్వము తప్ప అన్య మానవులందు అంతో యింతో భేదము వుంటుంది. అట్టి
వారినే మనము ఆదర్శముగా తీసుకోటమే ఉత్తమమైనటువంటి మార్గము. ఇంక జాతీయశీలత వుండినూడ
ను వ్యక్తిగత శీలము లేనప్పుడు అనేక సమయాలలో ఒక పరిస్థితి యందు భిన్నభేదాలు కలుగుతూ వస్తుం
టాయి. ప్రతి మానవుడు జాతీయ శీలత దృష్టియందుంచుకొని దేశసౌభాగ్యమును మొట్టమొదట మనము
కోరాలి. దీనిని అర్థము చేసుకోవాలి. దేశమంటే యేమిటి? ఎవరి కోసము యీ దేశము యేర్పడింది. ఎవరి
వల్ల యిది దేశము అని పిలువబడుతున్నది. దేశమునకు వుండవలసిన లక్షణములు యేమిటి? ఆ లక్ష
ణాలు పొందవలసినటువంటి వ్యక్తులు యెవరు. కనుక యీ లక్షణాలను పెంపొందించవలసినటువంటి
వ్యక్తుల తత్వాన్ని మనము గుర్తించినప్పుడే యిది జాతీయశీలతగా రూపొందుతూ వస్తుంది. ఒక
చిన్న ఉదాహరణము. మీకు అన్ని తెలుసున్న వాటి యందే వుదాహరణము చెప్పినప్పుడు మీకు
చక్కగా అర్థమవుతుంది.

దక్షిణ ఆఫ్రికా నుండి వచ్చిన తరువాత గాంధీ జాతి మత భేదములు లేకుం
డా సామాజిక జీవితములోపల సమత్వాన్ని రూపొందింపజేయాలి అని సంకల్పించుకున్నాడు.
ఏ విధముగానైనా భారత దేశమును దాసత్వము నుండి కాపాడి పాశ్చాత్యులను దూరముగా వించా
లని సంకల్పించుకున్నాడు. తాను అనేక మందిని చేర్చుకొని విప్లవాలలో పాల్గొన్నాడు. అలహాబాద్‌లో
అప్పుడు హైకోర్టు జడ్జిగా వుండినటువంటి వాడు నెహ్రూ తండ్రి మోతీలాల్. ఇలాంటి ధనవంతులై

101038705

నవారిని, కొంతవరకు పేరుప్రతిష్ఠలు వుండినవారిని యీ వుద్యమములో తీసుకున్నప్పుడు కొంత వరకు సహాయముగా వుంటుందనే ఉద్దేశ్యముతో గాంధీ మోతీలాల్‌ను సంప్రదించాడు. ఆ మోతీలాల్ అనేక భోగభాగ్యములతో మునిగి తేలేటువంటి వ్యక్తి. గొప్పశ్రీమంతుడు. ఆ కాలములో నెలకు నలభై వేలరూపాయలు సంపాదించేవాడు. అతని భవనములన్ని రాజభవనములుగా వుండేటువంటివి. కాని గాంధీ మాటను తిరస్కరించక తాను అంగీకరించి ఆ భవనమును స్వరాజ్య భవనము అనేటువంటి రీతిలో దానిని త్యాగము చేసి తాను కాంగ్రెసులో ప్రవేశించాడు. అతను ప్రవేశించటము చేత అతని భార్య అయిన స్వరూపరాణి కూడను యిందు పాల్గొనింది. ఈ ఉద్యమములో పాల్గొనటంచేత యిరువురు కొన్ని విధములైనటువంటి యిబ్బందులకు గురి అయ్యారు. ఆ సమయములోనే నెహ్రూ కూడ యిందులో ప్రవేశించాడు. అప్పుడు 1942లో గాంధీ క్విట్ ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ ఉద్యమములో యిరువురికి కొన్ని భేదాభిప్రాయములు ప్రారంభమైనాయి. నిర్దాక్షిణ్యముగా గాంధీ నెహ్రూను ఆ వుద్యమము నుండి తొలగించాడు. కాని నెహ్రూ కూడను సామాన్యమైనటువంటివాడు కాదు. పట్టుపడితే ధృఢమైనా వదిలేటువంటివాడు కాని పట్టు విడచేటువంటివాడు కాదు. ఉద్యమములో మెంబరు కాక పోయినా ఎక్కడికి వెళ్ళినా గాంధీతో వెనువెంటనే వెడుతూ వచ్చాడు నెహ్రూ. ఈ విధమైన సహనాన్ని గుర్తించుకుంటూ వచ్చేరు గాంధీ. ఈ వుద్యమమునుండి తొలగించటానికి కారణమేమిటి? ఇకడే వ్యక్తిగతమైన తత్వమును గుర్తించుతూ వచ్చారు character లో. తద్వారా తాను యీ ఉద్యమము నుండి నెహ్రూను తొలగించాడు. కానీ పెరుగుతూ పెరుగుతూ పోయేటప్పటికి కలసిమెలసి వుండే వ్యక్తులయొక్క తత్వాలు చక్కగా అర్థము చేసుకోటానికి వీలవుతుంది. నెహ్రూ తత్వాన్ని గాంధీ కనిపెట్టినప్పుడు గాంధీ తత్వాన్ని నెహ్రూ కనిపెడుతూ వచ్చాడు. తద్వారా యిరువురి యొక్క బలహీనతలు గుర్తించుకొని ఒకరికొకరు మరి చేరిపోయారు. కారణమేమిటి? మానవుని యందు శీలతత్వములో బలహీనతలు బయటపడిన తరువాత యింక వాని యొక్క గౌరవమర్యాదలు క్రమక్రమేణా కోల్పోతూ వస్తాయి. కనుకనే స్వరాజ్యము వచ్చిన తరువాత తక్షణమే నెహ్రూను ప్రధాన మంత్రిగా చేశాడు గాంధీ. ఈ నెహ్రూ మొట్టమొదట చేసినటువంటిదియేమిటి? రష్యావారితో సంప్రదించి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించాడు. ఈ ప్లానులు రష్యావారితో కలసి ప్రారంభమైంది. ఈ విధముగా స్వరాజ్యమును సాధించుకొని పరరాజులయొక్క ప్రబోధలననుసరించటం చేతనే క్రమక్రమేణా బలము తగ్గిపోతూ వచ్చింది. నెహ్రూకు సామాన్యమైన జీవితముపైన చాలా అభిరుచి. ఈ రకమైన సామాజిక జీవితాన్ని అభిరుచి పడటం చేతనే క్రమక్రమేణా secular state అనేటువంటిది ప్రారంభించాడు. అనగా సర్వమతములవారికి భారతదేశము సమన్వయమైనటువంటిది. ఏ మతము కూడను ఒకరికొకరు దూషించుకోకూడదు. విమర్శించకూడదు అనేటువంటి భావములు అభివృద్ధిపరచారు. ఇది మంచిదే. నేను యీ విషయం చెప్పటంలో కారణమేమనగా రాజకీయ తంత్రంలోపల అనేక కుయుక్తులు కూడను కొన్ని అభివృద్ధి అవుతూ వుంటాయి. ఇలాంటి కుయుక్తులు లేకుండాపోయినప్పుడు రాజ్యమును పరిపాలన చేయటమే చాలా కష్టమవుతుంది.

1010387 06

అయితే ప్రాచీన కాలమునందు యిలాంటి యుక్తులకుగాని, కుయుక్తులకుగాని అవకాశముండేదికాదు. వారిది హృదయమునుండి హృదయమునకు అందించుకొనేటువంటి సహజస్వభావాలు. కనుకనే వారియొక్క జీవితాన్నంతా చరిత్రలుగా మార్చుకుంటూవచ్చారు. ఆ చరిత్రలన్నీ పవిత్రముగా మారిపోతూ వచ్చాయి. కాని యీనాటి వారి ఆదర్శములు చరిత్రలకిందరూపొందలేదు. ఇందులో వెతికి నా పవిత్రము మనకు చిక్కటంలేదు. ఎప్పుడు యీ పవిత్రత మనకు లభిస్తుంది. వ్యక్తిగతశీలము, జాతీయశీలము రెండిటిని యేకత్వముగా భావించి దీనిలోపల ఆత్మతత్వము అనుభవించాలి. అదియే విశాలమైనటువంటి తత్వము. మనము చేసే ప్రతిపనియందు యీ రెండింటి యొక్క తత్వాన్ని గుర్తించి వర్తించాలి. ఈ పనివల్ల నా వ్యక్తిగతశీలమునకేమైనా భంగము జరుగుతుందా లేదా జాతీయశీలతకు యేమైనా అడ్డుతగులుతుందా అని విచారించి ఆ కార్యములో మనము ప్రవేశించాలి. మన మతమునకు యేమాత్రము అడ్డుతగులక దేశక్షేమమునకు యేమాత్రము అడ్డుతగులక వుండేటువంటి మార్గమును మనము అవలంబించాలి. అనేకమంది మహనీయులు తమయొక్క రాజ్యమును స్వతంత్రమైన రాజ్యముగా రూపొందింపచేసుకోవాలని ప్రాణాలను కూడను త్యాగము చేశారు. నేటివరకు కూడను దీనియందు పోరాడుతూనే వున్నారు. ఇది జాతీయశీలత అని చెప్పవచ్చును. మన విద్యను సంబంధించినటువంటివి జాతీయశీలత, వ్యక్తిగతశీలత యీ రెండింటిని మనము దృష్టియందుంచుకొన్నప్పుడు యెట్టి వ్యాపారమునందైనాగాని, యెట్టి వుద్యోగమునందైనగాని, ఎట్టి విధమైనటువంటి రంగమునందైనాగాని రాణించవచ్చును, విజయాన్ని సాధించవచ్చును. మొత్తముపైన వ్యక్తిగతశీలము మనము పోషించుకోవాలి. దృష్టియందుకాని, మనసుయందుకానీ, చేష్టలయందుకానీ మన వ్యక్తిగతశీలమునకు భిన్నముగా వుండరాదు. లోకములో యే బలము లేకపోయినప్పటికి యీ వ్యక్తిగతశీలమే ప్రధానమైన బలము, ఆధారమైన బలముగా తీసుకోవాలి.

వశిష్ఠ, విశ్వామిత్రుల మధ్యవున్న భావాన్ని యిందులో మనము యోచించవచ్చు. అహంకారరహితమై, ఆనందమయమై, నిస్వార్థరూపుడై, నిర్మలచిత్తుడై కర్తవ్యాన్ని నిర్వర్తించుటకు, కార్యమును సాధించటానికి ప్రయత్నించినటువంటివాడు వశిష్ఠుడు. ఒకానొకసమయములో దశరథమహారాజుననుచెబుతూవచ్చాడు అయ్యా దశరథమహారాజా మేము సర్వసంగపరిత్యాగులము, సకలశక్తిసంపన్నులము, మాకు కావలసినటువంటిదియేమీలేదు. అయితే నేను మీ వద్ద పురోహితునిగా వుండుటకు కారణం యేమిటి? మీ వంశములో శ్రీరామచంద్రుడు వుద్భవిస్తున్నాడు. అటువంటి భగవత్ స్వరూపముయొక్క సన్నిధిని పెన్నిధిని అనుభవించాలనే కాంక్షచేతనే నేను యీ పురోహితునిగా నియమితమయ్యాను. మీరేమో రాజులు మాకేదో గొప్పగా అందిస్తారని, దురాశచేతగానీ, ఆశచేతగానీ నేను యిందులో ప్రవేశించలేదు. అనగా లక్ష్యము దైవముపైన వుంచటము. దృష్టిని దైవముపైన వుంచి కర్తవ్యకర్మలను నిర్వర్తించుకొనిరావటం యిది వశిష్ఠులవారి సహజలక్షణము. విశ్వామిత్రుడు అట్లుకాదు. పరుల మంచితనాన్ని గానీ మంచినిగానీ చూచి సహించలేనటువంటివాడు. జమదగ్నియొక్క తత్వాన్ని గుర్తించి ఆ కామధేనువుయొక్క తత్వాన్ని కూడను గుర్తించి, ఆ కామధేనువు రాజు దగ్గర వుండవలసినదిగానీ, ఋషుల దగ్గర వుండవలసినది కాదు అని చెప్పి తాను దౌర్జన్యముతో కామధేనువును

101038707

తీసుకువెళ్ళాడు. అహంకారమిళితమై, స్వార్థము స్వప్రయోజనము దృష్టియందుంచుకొని మహర్షులను హింసించి, వారిమనసులకు కష్టముకలిగించి పవిత్రమైనటువంటి వస్తువును తాను అపహరించటానికిప్రయత్నించాడు. తనదికానటువంటి దానిని తనదిగా అనుభవించటానికి ప్రయత్నించేటువంటివాడు దొంగఅని మొన్నకూడ చెప్పాను. శాస్త్రముకూడను అతనిని విసర్జించింది. ఇలాంటి విశ్వామిత్రుని యేవిధముగానైనను బుద్ధిచెప్పిఅతనిని సరియైనమార్గములోనికి తెప్పించాలని జమదగ్నియనేకవిధములుగాప్రయత్నము చేశాడు. మహర్షులకు కోపం వుంటుందని అనుకుంటారు. వ్యక్తిగతశీలములతోబాటు ధైర్యము, పరాక్రమము, సహనము, సానుభూతి, త్యాగము యివన్నివారికివుండేతీరాలి. ధైర్యమే లేకపోతేవారు యీఅరణ్యములో కాలముగడపలేరు. పరాక్రమమేలేకపోతే యేపనికూడనుసాధించటానికి వీలుకాదు. కనుకయీవ్యక్తిగతశీలములతోబాటు యీప్రైగుణములు దానికిఅనుసరించివుండినప్పుడే వారుసాధించటానికి వీలవుతుంది. క్రోధముఅవసరమేకదా అని ఎప్పుడంటే అప్పుడు దానిని వినియోగించరాదు. సమయాన్నిబట్టిజాతీయశీలతను, వ్యక్తిగతశీలతను భంగము కలుగకుండావుండేపరిస్థితిలో దానిని వుపయోగపెట్టుకోవాలి. వశిష్ఠులవారితత్వాన్ని, వశిష్ఠులవారి శక్తిసామర్థ్యములను సాధించలనే వుద్దేశ్యములో అనేకవిధములుగా విశ్వామిత్రుడు తపస్సుచేశాడు. కానీయీతపస్సులతో మనకు లభించేటువంటిదికాదని గుర్తించాడు. భౌతికశస్త్రులునిరర్థకమని గుర్తించాడు. దైవబలమేనిజబలమని సర్వము దుర్బలములే అన్నాడు. ఏనాడు యీవిధమైనసత్యాన్నిగుర్తించాడో అప్పుడే వశిష్ఠులవారికి పాదాక్రాంతుడయ్యాడు. పాదాక్రాంతుడుకావటంచేతనే అహంకారమునిర్మూలమైపోయింది. అహంకారనిర్మూలనే బ్రహ్మర్షికి సరైన అర్హతఅనుకున్నాడు. ఆనాటి గొప్పగొప్పమహర్షులందరు అహంకారమనేటువంటి దానిని నిర్మూలనము చేసి స్వార్థము, స్వప్రయోజనములను అణగద్రొక్కి, సహనసానుభూతులతో పవిత్రముపట్టుదలతోకార్యమును సాధిస్తూ వచ్చారు.

ఈనాడు విద్యార్థులలో పట్టుదల అవసరమే. అయితేయీపట్టుదలమూర్ఖపు పట్టుదలగావుండకూడదు. పవిత్రమైన దానిని సాధించేసమయములో పట్టుదలఅత్యవసరము. దైవానుగ్రహమును, దైవబలమును, ధర్మబలమును సాధించటానికి పట్టుదల తప్పక అవసరమే. ఈపట్టుదలలో మనము అనేకవిధములైన పరాభవములు పొందవచ్చును. అవన్నీవిజయానికి సోపానములుగానే భావించాలి.

ఒకపెయింటరు వుంటాడు. ఆపెయింటరుకుంచె తీసుకుంటాడు గోడకురాస్తూ వుంటాడు. రాయటము చెరపటము, రాయటము చెరపటము యీరీతిగా జరుగుతూవుంటాది. ఇవన్నీ తన అభివృద్ధికి మూలకారణములే. పూర్వకాలము చిన్నచిన్నపిల్లలకు అక్షరాభ్యాసము చేసేటువంటివారు. ఒకేపలకపైన వ్రాసివ్రాసి అక్షరాన్ని గుర్తించుకొనేవారు. వ్రాయటము చదవటము, వ్రాయటము చదవటము అది ఒక వున్నతస్థితికి సోపానమే కదా! యుద్ధములో మహావీరుడుగా రూపొందవలెనన్న యుద్ధములోప్రవేశించే తీరాలి. అదేవిధముగనే శాంతిని మనముసాధించాలంటే అశాంతిలో మనముప్రవేశించాలి. అశాంతిలోని ప్రశాంతిని, ప్రశాంతిలోని ప్రకాంతి, ప్రకాంతిలోని

101038708

పరంజ్యోతి. పరంజ్యోతిలోనే పరమాత్మ తత్త్వము అన్నారు ప్రకాశవంతమైన దీపమునకు ప్రకాశము రావాలంటే చీకటిలోనే పెట్టాలి దానిని. వెలుతురులో పెడితే దాని ప్రకాశమునకు విలువలేదు. దానివలనే The pleasure is an interval between two pains అన్నారు. కనుక బాధలకు మనము లొంగిపోకూడదు. కృంగిపోరాదు. దైవముపై ధైర్యముగా విశ్వాసము వుంచుకొని, నమ్మకము పెంచుకొని దానిని మనము అనుసరించటానికి ప్రయత్నించినప్పుడు యిలాంటి దొన్నైనా మనము సాధించుతాము. జగత్తులోపల ప్రాచీనకాలము నుండి నేటివరకు చరిత్రరూపులుగా వచ్చినవారందరు కేవలము వారు చేసిన ఘనకార్యములవలన కాదు, వారిలో వున్న జాతియశీలత, వ్యక్తిగతశీలత యీ రెండు శీలములను పోషించుకోటమే వారియొక్క పెద్ద ఘనకార్యము.

ఆధ్యాత్మిక మార్గమునందు అనేకమంది మహనీయులు అభివృద్ధిగాంచారు. వశిష్టుడు, సత్యవంతుడు, హరిశ్చంద్రుడు, ధర్మరాజు, శిబిచక్రవర్తి, బలిచక్రవర్తి, దధీచి వీరందరు యీ మార్గములో ప్రవేశించి అనేకరకములైన ఆదర్శములను అందిస్తూ వచ్చారు. ఒక పక్షిని రక్షించటానికి తన ప్రాణాన్ని అర్పితము చేశాడు శిబిచక్రవర్తి. కనుక మంచిని రక్షించటానికి, మంచిని కాపాడటానికి కొంతవరకైనా మనము త్యాగము చేయటానికి సిద్ధముగా వుండాలి. అట్లు కాకుండా యేదో మాకు అధికారము అధికారము అనుకుంటే యిది అధికారము తో లభించేది అవమానమే తప్ప అగౌరవమే తప్ప మనకు సరియైనటువంటి శాంతి సుఖములు లభించవు. అధికారమనేది గొప్ప బలహీనము.

ఒక చిన్నకథ. ఒక యింటిలో అత్తాకోడలు వుండేటువంటివారు. కానీ యీ అత్తగారికి గొప్ప అహంకారము. ఏ ఒక్కటి అయినా నా ద్వారానే జరగాలి కానీ కోడలు యొక్క ఆజ్ఞతోగానీ, కోడలు మాటతోగానీ యేదీ జరగటానికి వీలుండకూడదు అని ఒక విధమైన భ్రమపెట్టుకుంది. ఏదో ఒక పక్కింటికి పోయింది అత్తగారు పనిపైన. ఆ సమయములోపల ఒక బిక్షగాడు యింటికి వచ్చాడు. ఇంటికి వచ్చి భవతి భిక్షాందేహి అన్నాడు. కోడలు చెప్పింది. యిప్పుడు యేమీ లేదండి వెళ్ళిరండని. కానీ వాడింకా భవతీ భిక్షాందేహి అంటున్నాడు. ఏమి నేను చెప్పింది నీకు వినబడటంలేదా పో. యిప్పుడు పెట్టటానికి వీలులేదని ఖండించింది. సరే అని చెప్పి బిక్షగాడు చిక్కిముఖము వేసుకొని పోతున్నాడు పాపం. అత్తగారు పక్కింటినుండి వస్తున్నారు. చూచింది తన యింటికి వచ్చి పోతున్నాడు యీ బిక్షగాడు అని. ఓరా బిక్షగాడా మా యింటికి వెళ్ళావా అని అడిగింది బిక్షగానిని. వెళ్ళాను అమ్మగారు అన్నాడు. ఏమినా కోడలు యేమన్నది అని అడిగింది. ఇప్పుడు పెట్టటానికి వీలులేదు పొమ్మని చెప్పింది అన్నాడు. నా కోడలు నిన్ను పొమ్మని చెప్పటానికి అధికారము యేమిటున్నది. రా నా వెంట రా అని తీసుకుపోయింది. ఆమాట చెప్పే అధికారం నాకుంది కానీ తనకెక్కడ వుంది రా నా వెంట అని తీసుకుపోయింది. ఈ బిక్షగాడు యేదో పెడుతుంది అత్తగారు అనుకున్నాడు. పదినిముషాలు లోపల వుంది అత్తగారు. పదకొండో నిముషము బయటకు వచ్చి యిదుగో పోయిరా యేమీ లేదు అంది. ఏమిటి అమ్మగారు మీరు యింటిలో ఆశ చూపించి నన్ను పిలుచుకొని వచ్చారు. ఏమైనా వేస్తారని ఆశపడ్డాను. యేమీ పెట్టకుండా పొమ్మంటున్నారే అని పాపం వాడు చాలా బాధపడ్డాడు. అప్పుడు యీ అత్తగారు చెప్పింది యింటికి వచ్చినవారిని

101038709

పాప్మని చెప్పటానికి అధికారము నాకుందిగానీ నా కోడలుకు యెక్కడవుంది. ఆ అధికారము చెలాయించటానికి నిన్ను పిలచానండి. ఇదేమన్న అధికారంగా రూపొందుతుందా అవమానముగా రూపొందుతుందా కొంచెం యోచన చేసుకోండి. ఈవిధమైన తుచ్ఛమైన భావాల్లోపల అధికారము చెలాయించాలని మనము ప్రయత్నిస్తూవుంటాము. మనము ఒక ఆఫీసు లోపల అధికారిగానే వెళ్ళవచ్చును. లేక యింకే విధమైనటువంటి మిల్లుల లోపల, ఫ్యాక్టరీస్ లోపల MBA చేశారు కనుక అక్కడ నీవు ఒక ఆఫీసరుగా నిలువవచ్చు. కానీ అక్కడ యీవిధమైన అధికారములు చలాయించరాదు. వ్యక్తిగత శీలము కాపాడుకోవాలి. జాతీయశీలమును కూడన మనము పోషించుకోవాలి. నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరిగేటువంటి మార్గాన్ని అవలంబించాలి. ఎలాంటి పరిస్థితులయందు మనము అసత్యానికి గురికారాదు. ఈ అసత్యమనేటువంటిది ఒకవిధమైన చెడు మార్గము పట్టిస్తుంది. సత్యము కూడను శీలములో ఒక భాగము. కనుక సత్యాన్వేషణ లోపల, సత్యవచన లోపల, సత్యము అనుసరించేటువంటి దానిలోపల కొంతవరకును జాగ్రత్త వహించాలి. సర్వమును కోల్పోయినాడు హరిశ్చంద్రుడు కానీ తన సత్యాన్ని మాత్రము కోల్పోలేదు. ఆ సత్యమును కాపాడుకొనే నిమిత్తమై ఆలుబిడ్డలను అమ్ముకున్నాడు పాపం. నక్షత్రకునకు యివ్వవలసిన వడ్డీడబ్బులు కూడను యివ్వలేకపోయాడు. తినటానికి తిండిలేదు. త్రాగటానికి నీరులేదు. తనువడ్డీ యేవిధముగా చెల్లించగలడు. అతని ధర్మపత్ని కూడను అలాంటి సత్యవ్రతమునే ఆచరిస్తూవచ్చింది. భర్తకు యీ సత్యమునందు తగినటువంటి బలమును అందించేటువంటిది. ఒంటరిగా కూర్చొని విచారణ చేస్తున్న సమయము పురస్కరించుకొని చంద్రమతి అతని పాదములు పట్టుకుంది.

కాలగతి సర్వసంపదలు కోల్పోయి
మిగిలిన సిరి నేను మీకును మీరు నాకు
కాన యేకలవారికైన నన్ను అమ్మికొని
ఈ ఋషి ఋణంబు తీర్చుకొమ్ము.

అనింది. ఇలాంటి త్యాగానికి సిద్ధమైనవారి పేరే చరిత్రలు. నన్ను అమ్మికొని యీ ఋషి ఋణము తీర్చుకొమ్మని యే సతియైనా పలుకుతుందా. నీవు పుట్టిపేరుండా దాన మిచ్చావు నేవు కావలసివుంటే అరణ్యానికి పో నేను నా పుట్టింటికి పోతాను అంటారు యీనాడు. ఇలాంటి సమన్వయము చేత, సహనము చేత ఒకరి నొకరు సానుభూతి కలిగించుకొని సత్యమును విడవకుండా త్యాగాన్ని అవలంబించటమే చరిత్రకు సరియైనటువంటి గుర్తు. ఇలాంటి వారి చరిత్రలు కొల్లలుగా వుంటున్నాయి. కనుక చరిత్రలు మీరు చదవాలనుకున్న చరిత్రలు మీరు అనుసరించాలనుకొన్నా ప్రాచీనుల చరిత్రలు మీరు అనుసరించండి. శిబిచక్రవర్తి, బలిచక్రవర్తి, దధీచి వీరందరు యెంతో త్యాగము చేసినటువంటివారు. అట్టి మహనీయుల వల్లనే భారతదేశము యొక్క చరిత్ర యీనాటికి పవిత్రముగా, దేదీప్యమానముగా వెలుగుతూవుంటున్నది. యుగములు మారినా, జగములు కదిలినా పేరులు మాత్రము ప్రఖ్యాతితో దేదీప్యమానముగా ప్రకాశిస్తూవున్నవి. రాజకీయసంబంధమైనటువంటిది గానీ, భౌతికసంబంధమైనటువంటిది గానీ, లౌకికసంబంధమైనదానితో యింతకాలము వారి పేర్లు వినబడుతున్నాయి మన దేశములో. గొప్ప విజ్ఞానవంతు

101038710

క్రైనటు వంటి విన్‌స్టన్ యిలాంటి వారందరూ కూడను క్రమక్రమేణా వారి పేర్లు కరగిపోతూ వస్తున్నాయి. ఈవిద్యలే అనిత్యములు. పదవులే అనిత్యములు. ఈ పరిశోధనలే క్షుద్రములు. ఇలాంటి శాశ్వతమైన రీతిగా కీర్తిని యేరీతిగా సాధించగలరు. స్వరాజ్యము వచ్చి నలభైయేండ్లు కూడా కాలేదు. ఏదియో మహనీయులయొక్క పేరుప్రతిష్టలు మనకు యెక్కడైనా వినపడుతున్నాయా. ఈ త్యాగశీలుర యొక్క పేరుప్రతిష్టలు యేమైనా వినబడుతున్నాయా. హరిశ్చంద్రుడు యేకాలము వాడు. సత్యవంతుడు యేకాలము వాడు. ధర్మరాజు యే కాలము వాడు. కానీ యీనాటికి కూడను వారు సజీవముతో దేదీప్యమానముగా వారు ప్రకాశిస్తూనే వున్నారు. వారే అమరజీవులు. వారిదే అమృత జీవితము. వారిదే చరిత్ర ప్రఖ్యాతి గాంచినటువంటి తత్వము. అలాంటివారే ఆచార్యులు. కనుక అట్టి ఆచార్యులైనటువంటి వారియొక్క తత్వమును, వారి అడుగుజాడలను అనుసరించటము ప్రతి మానవునకు కర్తవ్యము. ఈనాడు ముఖ్యముగా జాతీయ శీలత, వ్యక్తిగతశీలత యీ రెండు కలసినటువంటి వారే ఆదర్శవంతమైన పురుషులు అనేటువంటి సత్యమును గుర్తించాము. క్రమక్రమేణా ఆవ్యక్తులను గురించి మనము చెప్పుకోవచ్చు. ముఖ్యముగా మన Institute పిల్లలు అందరు కూడను వ్యక్తిగత శీలమే కాకుండా జాతీయ శీలతను కూడను చేబట్టాలి. దేశమును మనము ప్రేమించాలి. దేశక్షేమాన్ని మనము కోరాలి. దేశానికి మనము త్యాగము చేయాలి. ఈ దేశములో పుట్టినందుకు యిదే నా కర్తవ్యమని దృఢముగా భావించుకోవాలి. ఇది నా మాతృభాష. ఇది నా దేశము అని యెదగొట్టి చెప్పటానికి సంసిద్ధులు కావాలి. నాది పవిత్రమైన భారత దేశము. నా దేశము త్యాగభూమి. తపోభూమి. ఇలాంటి భూమిలో పుట్టినటువంటి వాడను నేను యింత క్షుద్రునిగా, యింత చిన్నవానిగా, సంకుచితమైన మార్గములోనే ప్రవేశించరాదు అనే విశాలమైన భావమును అభివృద్ధిపరచుకోవాలి. మనము తినేతిండి భారత దేశముది. మనము తాగే నీరంతా భారతదేశముది. మనము నివశించే దేశము భారత దేశము. మనము పీల్చుకొనే గాలంతా భారతదేశము యొక్క వాతావరణమే. ఈ పంచభూతాల్ని మనము అనుభవిస్తూ యీ పంచభూతమైనటువంటి భారతదేశమునకు కృతజ్ఞత చూపనక్కరలేదా? అందుకోసమే గాంధి కూడా చెప్పాడు. స్వదేశము యొక్క వస్త్రాన్ని మాత్రమే, వస్తువులు మాత్రమే మీరు వుపయోగించాలి. విదేశ వస్తువులు వుపయోగించరాదన్నాడు. కారణం యేమిటి విదేశీవస్తువులు వుపయోగించుకుంటూ వస్తే మనమంతా మనదేశాన్ని మరచిపోయి విదేశమునే విశ్వసిస్తూ దానినే మనము ఆధారము చేసుకుంటూ వుంటూ మనే వుద్దేశ్యముతో దానిని త్యజించే మార్గానికి బోధన చేస్తూ వచ్చాడు. స్వరాజ్యము సంపాయించటానికి స్వదేశవస్తువులే వుపయోగించాలి అన్నాడు. నా వుద్దేశ్యము కూడా అదే. స్వారాజ్యము సంపాదించటానికి కూడను స్వదేశవస్తువులే వుపయోగించాలి. ఆస్వదేశవస్తువు యేదంటే ఆత్మే స్వదేశవస్తువు. మనసు, బుద్ధి, చిత్తము, అంతఃకరణ యివన్నియు విదేశవస్తువులే. ఎప్పుడో మారిపోయేటు వంటివే. ఎప్పుడో కూలిపోయేటువంటివే. స్వదేశవస్తువు అదే ఆత్మ. స్వదేశము ఆత్మదేశము. ఈ ఆత్మదేశమును మనము అనుసరించాలిగానీ యీ విదేశవస్తువులంతా అనుసరించరాదు. మనసు బుద్ధి చిత్తము అంతఃకరణ మనము త్యజించి యీ ఆత్మయందు లక్ష్యము నుంచుకొనుటయే విద్యార్థుల ప్రధాన కర్తవ్యమని విశ్వసించి మీరు ఆదర్శమును నిరూపించాలని ఆశీర్వదిస్తున్నాను.